www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 20 మే 2025

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి : ఎస్పి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సెన్సార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి (పరిపాలన) కె. ప్రకాష్ బాబు, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందేదెన్నడో!

- ఏడాదైనా ఊసే ఎత్తని ప్రభుత్వం
- అన్నదాతల ఎదురు చూపులు
- ఖరీఫ్ పెట్టుబడులు ఎలా అంటూ ఆవేదన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది రబీ సీజన్ తుది దశకు చేరుకుంది. అతి త్వరలోనే మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ప్రభుత్వం నుంచి రైతులకు పేసరంత సాయం కూడా అందని దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీగా రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ప్రతి సంవత్సరం ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయలేదు. దీంతో కూటమి సర్కారు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో పెట్టుబడుల కోసం ఈసారి కూడా అప్పులు తప్పవా అంటూ రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలను చవి చూస్తున్న రైతాంగం ఇప్పుడు పెట్టుబడుల కోసం మరోసారి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రబీలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అక్కరకు రాకపోవడంతో తక్కువ ధరకే దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర నష్టాలకు గురయ్యారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పెట్టుబడుల కోసం అప్పులకు తిప్పలు పడుతున్నారు.

ఏడాదిగా ఎదురు చూపులు

ఉమ్మడి జిల్లాలో 4.97 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి వేస్తామని, అన్నదాతల సంక్షేమమే తమ లక్ష్యం అంటూ అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేసింది ఏమీ కనిపించడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చి ధాన్యాన్ని సేకరించిన 24 గంటల్లోనే సొమ్ములు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పుకొచ్చిన ప్రభుత్వం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కూటమి సేకరించలేకపోతోంది. ప్రక్రియలో ఈ దళారులదే పైచేయిగా కనిపిస్తోంది. దీనికి ఉదాహరణ రబీ సీజన్లో ధాన్యం సేకరణ అని చెప్పుకోవచ్చు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కోసం ఏడాదికాలంగా ఎదురుచూపులు తప్పడం లేదు.

అన్నదాత సుఖీభవ ఎప్పటికో..?

గత ప్రభుత్వం రైతు భరోసాగా రూ.7,500 ఇచ్చేది. రూ.5500, రూ..2000 లు రెండుసార్లు ఈ సాయం అందించేది. మూడు విడతల్లో రూ.6 వేలు అందేది. దీంతో రైతులకు ఎంతో కొంత ఊరట కలిగేది. పెట్టుబడికి కాస్త సాయం అందేది. కానీ కూటమి సర్కారు మాత్రం ఈ మొత్తం సాయాన్ని పిఎం కిసాన్ సంబంధం లేకుండా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా అందజేస్తామని చెప్పింది. పిఎం కిసాన్ సొమ్ములు ఒక వాయిదా మాత్రమే రూ.2 వేలు అందాయి. రెండో వాయిదా ఈ నెలలో అందాల్సి ఉండగా ఇప్పటికీ జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ.20 వేలు ఎప్పటికీ అందుతాయనేది వ్యవసాయ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుని ఈ ఖరీఫ్ సీజన్ కైనా పెట్టుబడి సాయం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అప్పులు చేసి సాగు పనులు

ఏటా అనేక ఇబ్బందులు పడుతున్నాం. సాగు పనుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో ప్రభుత్వమయినా పెట్టుబడి సాయం అందిస్తుందని ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ సాయం అందించలేకపోతోంది. ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలి

- గంగిరెడ్డి, రైతు, పులివెందుల మండలం

ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత

స్టార్టప్ కంపెనీకి శంకుస్థాపన చేసిన ఇన్చార్జి మంత్రి సవిత, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- కడప అర్బన్

నేటి యువత ఉద్యోగం అందుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల సమీపంలో 'స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్"నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది చంద్రబాబు నాయుడు అన్నారు. ఆశించే స్థాయి నుంచి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుంచి ఒక స్టార్ట్ అప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి స్టార్ట్ ఆప్ కడప కార్యక్రమాన్ని మన జిల్లాలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం మన అదృష్టం అన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్ట్ అప్ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దేశగా కీలక పాత్ర పోషించనుందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్‌ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జిఎ-3 అంతస్తులతో, పిఇబి టెక్నాలజీ ఆధారంగా ఈ స్టార్ట్ అప్ కేంద్ర భవన నిర్మాణం చేపడతారని పేర్కొన్నారు. స్టార్టప్ కడప కేంద్రం యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ, నూతన ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనలను అభివృద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించే లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు కేంద్రం అందించనుందన్నారు. రాయలసీమ జిల్లాల్లోని యువత స్టార్ట్ అప్ కడప సెంటర్ ద్వారా రాష్ట్ర.ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకుని వారి కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో రూ.10 కోట్లు అంచనా వ్యయంతో ఈ స్టార్ట్ అప్ సెంటర్ నిర్మాణం చేపట్టడం కొనసాగుతుందని తెలిపారు. ఇందుకు స్థానిక షిర్డీసాయి ఎల్రక్టికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించిందన్నారు. 'స్టార్టప్ కడప' కేవలం ఒక భవనం మాత్రమే కాదని ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడనుందన్నారు. ఈ సందర్భంగా ఆయనర్మాణ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను, బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా మంత్రికి వివరించారు. కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత నడిబొడ్డున ఉన్న కడప నగరంలో రూపుదిద్దుకుంటున్న పీ-4 స్టార్ట్ అప్ కడప భవన నిర్మాణం భవిష్యత్తులో యువతకు గొప్ప ఉపాధి వనరుగా మరనుందన్నారు. సాంకేతిక విద్యా నైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థి, యువతకు ఎంతో ఉపయోగకరం అన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను తీసుకురావాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలు నేటి యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయనుందన్నారు. జెసి అదితిసింగ్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతికి, యువతలో నూతన ఆవిష్కృత పటిమను, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించబడిన 'స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్' మన జిల్లా యువతకు చేరువలో రూపుదిద్దుకోవడం అదృష్టకరమైన, ఆనందదాయకమైన విషయం అన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడపలో స్టార్ట్ అప్ సెంటర్ ద్వారా స్థానిక యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి ఆలోచనలకు సరికొత్త రూపం కల్పిస్తూ ఎంటర్ప్రెన్యూషిప్ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు ముఖ్యమంత్రి సరికొత్త ఆలోచనలకు కడప నగరం వేదిక కావడం గర్వించదగ్గ విషయం అన్నారు.

ఎలాంటి చర్యలు తీసుకోవద్దు : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

డిఇఒకు వినతి పత్రమిస్తున్న నాయకులు

వివిధ అనారోగ్య కారణాలతో -2024 ఎన్నికల విధులకు హాజరు కాలేక పోయిన ఉపా ధ్యాయులపై ఇలాంటి చర్యలు తీసుకోవద్దని, ప్రస్తుతం నిర్వహించే ఉద్యోగో న్నతులు, బదిలీ లలో వారికి అవకాశం కల్పించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాషా, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా కోరారు. సోమవారం డిఇఒ షంషుద్దీన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు కొంతమంది ఉపాధ్యాయులు వ్యక్తిగత, అనారోగ్య కారణాలతోనూ విధులకు హాజరు కాలేని పక్షంలో రిజర్వులో ఉన్న సిబ్బందితో విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. ఇలా ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ వారిపై బనాయించి పెండింగ్‌లో ఉన్నాయని తెలుపుతూ ప్రస్తుత ఉద్యోగ్యోన్నతి బదిలీల్లో అవకాశం లేకుండా చేయడం న్యాయసమ్మతం కాదని తెలిపారు. మానవతా దృక్పథంతో అనారోగ్యంగా, వ్యక్తిగత కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కానీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు టి.ఖాదర్ బాషా, కె.నరసింహారావు, మహబూబ్ బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి వారి సమస్యలను గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కడప నగరం రామచంద్రపురానికి చెందిన షేక్ హుస్సేన్ పీరాన్ తనకు 60 సంవత్సరాలు వచ్చాయని వృధ్యాప్య పింఛను మంజూరు చేసి ఇవ్వాలని అభ్యర్థించారు. చెన్నూరు మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ సలాం తన భూమికి హద్దులు చూపి ఆక్రమణ నుండి కాపాడాలని విన్నవించారు .వల్లూరు మండలం అంబవరానికి చెందిన సి. ఆదినారాయణ రెడ్డి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కడప చెమ్ముమియా పేటకు చెందిన కె. గోవిందయ్య తనకు టిటిసి శిక్షణకు అర్హత ఉన్న తరగతులకు హాజరు కావడానికి అనుమతి ఇవ్వడం లేదని టిటిసి ట్రైనింగ్ సెంటర్ వారి విచారించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్‌పిసిఇఒ ఓబులమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, సర్వే ల్యాండ్ అధికారి మురళి కృష్ణ, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కెజిపిజి సెట్-2కె25 ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : కందుల గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ (కెఎస్ఆర్ఎం మేనేజ్మెంట్ స్టడీస్) నిర్వహించిన కెజిపిజి సెట్ - 2కె 25 ఫలితాలను కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 నుంచి ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 200 పరీక్ష రాయగా 104 మంది అర్హత సాధించారని చెప్పారు. అర్హత సాధించిన విద్యా ర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఉచిత విద్య అందిస్తామని పేర్కొన్నారు. స్వీయ అవగాహన కలిగి నైపుణ్యాలను పెంచు కోవడానికి, మీ నైపుణ్యాలను అన్వేషించడానికి సమయం కేటాయి ంచాలని కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబిఎ పీజీ కోర్స్ ప్రారంబి.ంచేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌నుంచి 120 సీట్లకు అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల అర్థవంతమైన సంబంధాలను నిర్మించుకోవడానికి, ప్రపంచంపై సానుకూల ప్రభావాన్ని చూపడానికి అనుగుణంగా మేనేజ్మెంట్ విద్యను అందిం చాలనే లక్ష్యంతో అనుమతి పొందమని వివరించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి .రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఇన్చార్జి రాయపాటి నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న ఎమ్‌డి కందుల ఓబుల్‌రెడ్డి

బ్రౌన్ గ్రంథాలయం కడపకు వరం : మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విజ్ఞానదాయకమైన గొప్ప పుస్తక సంపదను కలిగిన బ్రౌన్ గ్రంథాలయం కడపకు వరమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీరామా రావుదన్నారు. 1995లో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు బ్రౌన్ గ్రంథాలయాన్ని అధికారికంగా ప్రారంభించారని, ఇప్పుడు నిర్మించబోయే నూతన భవనాన్ని కూడా ఆయన చేతనే ప్రారంభింపజేస్తామని చెప్పారు. కలెక్టర్‌శ్రీధర్ మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణంలో మూడవ అంతస్తు వరకు ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తింపబడిందని, తెలుగు భాషా సాహిత్యాలకు ప్రధాన కేంద్రంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కడప అంటే ఇతర ప్రాంత ప్రజలకు చిన్నచూపు ఉందని, కానీ బ్రౌన్ గ్రంథాలయం లాంటి విజ్ఞానసౌధం ఆ అపనిందను రూపు మాపేలా వెలసిందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుట్టా చైతన్యకృష్ణరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో తెలుగుభాషతో పాటు ఇతర భాషలకు చెందిన గ్రంథాలు అందుబాటులోకి తేవడం వల్ల మరింత విస్తృతికి తోడ్పడుతుందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ సహాయ సహకారాలు మరింత అందేలా చూస్తా మన్నారు. జెసి అధితి సింగ్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం మూలకేంద్రంగా ఉందని, జిల్లా ప్రజలందరూ కూడా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, సి.పి.బ్రౌన్ భాషా పరిశో ఃధన కేంద్రం మెంబర్ సెక్రటరీ ఆచార్య పుత్తా పద్మ ఆహ్వానం పలుకగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, కడప ఆర్‌డిఒ . ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, మెప్మా పీడీ కృష్ణకుమార్, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, గ్రంథాలయ అభిమానులు పలువురు పాల్గొన్నారు.

పేద పిల్లల కోసం జిల్లా సతి కమిటీ : జడ్జి

ప్రజాశక్తి - కడప : పేద పిల్లల కోసం జిల్లా సతి కమిటీని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సి ఆసిఫా సుల్తానా అన్నారు. సోమవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదనలో నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు - ఆధార్ కోసం సర్వే, ట్రాకింగ్, సమగ్ర చేరికకు ప్రాప్యత' అనే అంశంపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నిరుపేద పిల్లల కోసం సతి ప్రచార పత్రం అమలు - ఆధార్ కోసం సర్వే, ట్రాకింగ్, సమగ్ర చేరికకు ప్రాప్యత, ఆధార్ నమోదు, న్యాయసహాయం, సంక్షేమ పథకాలు మొదలు అంశాలను వివరిం చారు. పేద పిల్లల కోసం జిల్లా సాథి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ పేద పిల్లల అవసరాలను గుర్తించి తగు న్యాయ సహాయం అందిస్తు ందన్నారు. ఈ కమిటీ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సర్వే, ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంప్స్ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమాలు ఈనెల నుంచి ఆగస్టు 15 వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా పానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, కళాశాల విద్యా ర్థులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కరు విద్యార్థుల డేటాను సేకరించి వారికి రావలసిన ప్రభుత్వ పథకాల కోసం కృషి చేయాలన్నారు.

నేడు ప్రొద్దుటూరులో మినీ మహానాడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు పట్టణంలో మంగళ వారం నియోజకవర్గ మహానాడు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1982 కీ.శే. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి, 1983 సంవత్సరంలో ఎన్నికలలో పోటీ చేసి తెలుగుదేశం పార్టీ విజయం సాధించిందని, ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది సాంప్ర దాయ ప్రకారం మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వివరిం చారు. ఈ ఏడాది కడపలో మహానాడు బహిరంగ సభ నిర్వహిస్తారని, తెలిపారు. ప్రొద్దుటూరులో మినీ మహానాడు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని భారత్ ఫంక్షన్ హాల్ దగ్గర నిర్వహిస్తున్నామన్నారు. కూటమి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

వినోదంతో విజ్ఞానం

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవిలో వినోదం-వినోదంతో విజ్ఞానం లభిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా అన్నారు. సోమవారం ఆర్‌కె నగర్ లోని ఉర్దూ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'వేసవి వినోదం' పేరిట సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. జివివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మిరాజా మాట్లాడుతూ వేసవి వినోదం పేరిట ప్రారంభించిన సమ్మర్ క్యాంపు పిల్లల బుద్ధిని వికసింపజేసే ఒక సృజనాత్మక వేదికని పేర్కొన్నారు. ఇటువంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెవివి నగర అధ్యక్షులు శివరామ మాట్లాడుతూ మన సమాజంలో ప్రజలలో విజ్ఞానాన్ని నింపాలన లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఇటువంటి సమ్మర్ క్యాంపులు పిల్లలలోని కళా ప్రతిభను వెలికి తీయడమే కాకుండా ఆలోచన సామర్థ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఐద్వా అధ్యక్షురాలు ఐ.ఎన్. సుబ్బమ్మ పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపు జూన్ 5 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఇందులో చిత్రలేఖనం, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, ఓరిగామి, పాటలు, మట్టి బొమ్మల తయారీ మొదలగు అంశాలపై నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్ల చేత అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరై దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్ పర్సన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గఫూర్, రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు రెడ్డి, రంగనాయకులు, కామేశ్వరమ్మ, లక్ష్మీదేవి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శిక్షణను ప్రారంభిస్తున్న రిమ్స్ ప్రిన్సిపల్ టి. జమున

వైద్య కళాశాలలో శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ వైద్య కళాశాలలో సిఎంసి నెల్లూరు వారి ఆధ్వర్యంలో వైద్యులకు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు సిఎంసి నెల్లూరు వారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిక్షణ ఈనెల 21 వరకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ పి సోఫియ, కో-ఆర్డినేటర్ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్, ఎన్ఎంసి నియమించిన అబ్జర్వర్ డాక్టర్ సృజన్ శర్మ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ట్రామ సర్జరీ, సిఎంసి, వేలూరు పాల్గొన్నారు.

టెయిలింగ్‌పాండ్ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - వేముల : మండలంలోని స్థానిక తుమ్మలపల్లి యురేనియం కర్మాగారం నుంచి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాలను టైయిలింగ్‌పాండ్‌లో నిల్వ చేయడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పరిష్కరించాలని యురేనియం ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవికి విన్నవించారు. సోమవారం గ్రామస్తులు ఆయన్ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలిపారు. టెయిలింగ్ పాండ్ వల్ల పచ్చని పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నాయని, తాగు, సాగునీరు సైతం కలుషితమవుతున్నాయని వాపోయారు. కేకే కొటాల గ్రామానికి నష్టపరిహారం ఇవ్వాలని, తమ భూములు తీసుకోని ఉద్యోగవాకాశాలు కల్పించాలని కోరారు. స్పందించిన బిటెక్ రవి యురేనియం అధికారులతో కలిసి పరిశీలించి తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

చరిత్రను తొలగించడం సరికాదు

ప్రజాశక్తి - కడప

కేంద్ర ప్రభుత్వం మరోసారి తాజాగా సెంట్రల్ స్టడీస్‌కు సంబంధించిన ఏడో తరగతి సోషల్ సైన్సెస్ సబ్జెక్టులో మొఘల్ చక్రవర్తుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను పూర్తిగా తొలగించడంతో ప్రధాని నరేంద్ర మోడీ దేశద్రోహానికి పాల్పడ్డారని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ బాషా తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం ముస్లిం మైనార్టీల పట్ల మతవిద్వేషంతో ఎంతో ప్రాశస్త్యం కలిగిన మొగలుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇది పూర్తిగా దేశ చరిత్ర హననం చేయడమేనని విమర్శించారు. మతం పేరిట ముస్లిములను పూర్తిగా అణగదొక్కేదుకు వారికి సంబంధించిన చరిత్రను పాఠ్యాంశాలలో తీసివేయడం సరికాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుండి దేశ చరిత్రలో పూర్తిగా అంతర్భాగమైన మొఘలుల, ఢిల్లీ సుల్తానుల చరిత్ర ప్రతి తరగతికి సంబంధించిన పాఠ్యాంశంలో సిలబస్‌గా ఉందన్నారు. అయితే మతవిద్వేష పాలకుడు, నియంత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం లోని ఎన్‌సిఇఆర్‌టి ఇటీవల ఏడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర సిలబస్‌లో సదరు చరిత్రను తీసివేసినట్లు ప్రకటించడం దారుణమన్నారు. వెంటనే తొలగించిన సదరు దేశ చరిత్రను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు.

సామాన్యులకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకున్నా సామాన్య ప్రజల సంక్షేమానికి విశాఖపట్నం కో- ఆపరేటివ్ లిమిటెడ్ బ్యాంక్ సేవలు అందిస్తుందని బ్రాంచ్ డైరెక్టర్ జె.వి.సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం కడప బ్రాంచ్ సర్వ సభ్యుల సమావేశం శివప్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, చిన్న వ్యాపారులకు, విద్య, వైద్య అభివృద్ధికి, వృత్తికారులకు రుణాలు అందించడమే కాకుండా, ప్రజల పొదుపుపై ఇతర వాణిజ్య బ్యాంకులకన్నా అధిక వడ్డీని చెల్లిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు కొనుగోలు చేసే శక్తి ఉన్నపుడే భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పన్నుల భారం పెరుగుతుంది, ఆదాయం పెరగటం లేదన్నారు. ప్రజల పొదుపుపై ఇతర బ్యాంకుల కన్నా విశాఖ పట్నం బ్యాంకు అధికవడ్డీని అందిస్తూ ప్రజాసంక్షేమానికి తోడ్పడుతున్నామన్నారు. ఈ ఏడాది రూ.7 కోట్ల డిపాజిట్లు ఉండగా రూ.30 కోట్ల రుణాలు కడప ప్రాంత ప్రజలకు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించినట్టు పేర్కొన్నారు. బ్యాంక్ అభివృద్ధికి, సేవల విస్తరణకు సహకరిస్తున్న సభ్యులకు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఇంచార్జ్ డైరెక్టర్ నారాయణ స్వామి, జోనల్ మేనేజర్ వెంకటేశ్, కడప బ్రాంచ్ మేనేజర్ తులసి కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె. సంతోషరావ్ కడప పట్టణంలోని పబ్బాపురం సమీపంలో మహానాడు ప్రాంగణంలో చేపడుతున్న విద్యుత్ పనులను సోమవారం జిల్లా విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ ఈనెల 27, 28, 29, తేదీలలో ముఖ్యమంత్రి మహానాడు పర్యటనకు నిరంతరాయ విద్యుత్ కోసం అవసరమైన ఏర్పాట్లు వేగ వంతం చేయాలని ఆదేశించారు.మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో రానున్నారని, విద్యుత్ భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి చిన్న విద్యుత్ సమస్య కూడా తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు.లైన్ల ఏర్పాటు గురుంచి అధికారులతో చర్చించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీరు ఎస్. రమణ, ఎక్సిక్యూటివ్ ఇంజనీర్లు నాగరాజు, హరిసేవ్య నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న సిఎండి

విరాళం అందజేస్తున్న దాతలు

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె భద్రకాళి సమేత వీరభద్ర స్వామి శాశ్వత అన్నదాన వితరణకు గాను చాపాడుకు చెందిన కుర్మయ్య సుబ్బలక్ష్మి దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు. సోమవారం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెంచు వీరనారాయణ యాదవ్‌కు మొత్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ శాశ్వత అన్నదాన వితరణకు గాను మొదలుగా రూ. లక్షలిచ్చిన రసీదు పొందారన్నారు. ఈ నగదును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చిన మొత్తంతో దాత పేరున అన్నదానం చేస్తామన్నారు. దాతలను అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెన్నపూస ఓంమహేశ్వర రెడ్డి, గోసుల వీరారెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె శ్మశాన వాటికకు రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పరిచే పనులను సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా ప్రతి మండలంలో ఐదు గ్రామాలలో శ్మశాన వాటికలను ఎంపిక చేసి ఉపాధి చట్టం ద్వారా రూ. 20 లక్షలతో అన్ని రకాల వసతులతో శ్మశాన వాటికలను నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 25 శ్మశాన వాటికలు పూర్తి కాగానే మిగిలిన అన్ని గ్రామాలలో నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముని శేఖర్‌రెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మండల శాఖ మాజీ అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రజినీ కాంత్, నాయబ్ రసూల్, జైనుల్లా, రామ్మోహన్ సచివాలయ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

రేపు లింగాల మండల సమావేశం

ప్రజాశక్తి-లింగాల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రమాదేవి అధ్యక్షతన ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎపిడిఒ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, వ్యవసాయం ,రెవెన్యూ, ఉద్యానశాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల పైన సమీక్ష నిర్వహిన్నట్లు తెలిపారు సమావేశానికి మండల స్థాయి అధికారులు సమగ్ర నివేదికతో హాజరు కావాలని కోరారు

గోపవరం ఉప సర్పంచ్‌గా రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైసిపి మద్దతుదారుడు రాఘవేంద్రారెడ్డి ఎన్నికయ్యారు. మార్చి 27న ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉప సర్పంచులు, జడ్‌పి చైర్మన్ తదితర పదవుల భర్తీ కోసం ఎన్నికలు నిర్వహించగా, గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ పదవి కోసం కేవలం ఆరుగురు సభ్యులే ఉన్నా టిడిపి మద్దతుదారులు బరిలో నిలవడం, సంఖ్యా బలం ఉన్న వైసిపి మద్దతుదారులపై పోలీసుల సమక్షంలోనే దాడి, నకిలీ వార్డు మెంబర్లతో కోరమ్ వంటి సంఘటనల కారణంగా తొలిరోజు ఎన్నిక వాయిదా పడింది. రెండవ రోజు టిడిపి వార్డు మెంబర్ల పరస్పర దూషణలు, మినిట్స్ బుక్ చించివేత, ఎన్నికల అధికారి అస్వస్థతకు గురి కావడం వంటి పరిణామాలతో అప్పుడూ వాయిదా పడింది. సోమవారం ఎట్టకేలకు ఎన్నిక పూర్తయింది. అందరూ అనుకున్నట్లు గానే 13 మంది సభ్యుల మెజారిటీ ఉన్న వైసిపి మద్దతు దారులకే పీఠం దక్కింది. ఎన్నిక నేపథ్యంలో గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద పోలీసుల భారీ బందోబస్తు డిఎస్‌పి పూతి భావన ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఉప సర్పంచ్ ఎన్నికను 11 గంటలకు ఎన్నికల అధికారి రామచంద్రారెడ్డి నిర్వహించారు. గోపవరం పంచాయతీకి 100 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలన్నీ బంద్ చేసి, 144 సెక్షన్ విధించారు టిడిపికి చెందిన వార్డు సభ్యులు ఎవరూ ఎన్నిక సమయంలో పంచాయతీ కార్యాలయం వద్దకు రాలేదు. కేవలం ఒకరు మాత్రమే వచ్చి ఎన్నికకు సహకరించారు. దీంతో కోరమ్, మెజారిటీ ఉండటంతో ఎన్నికల అధికారి వైసిపి మద్దతుదారుడు బీరం రాఘవేంద్రారెడ్డిని ఉపసర్పంచిగా ఎన్నిక చేసి నియామక పత్రం అందజేశారు.

నియామక పత్రం అందుకుంటున్న రాఘవేంద్రరెడ్డి

క్రైం కార్నర్

దారి దోపిడీ దొంగలు అరెస్టు

- బంగారు, మోటార్ సైకిల్, నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం
- డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

కమలాపురం పరిధిలో అక్రమ ధనార్జన కోసం ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారు గొలుసు లాక్కోవడం, రోడ్డుపై వచ్చే వాహనాలు ఆపి దారిదోపిడీ చేసే ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలకు పాల్పడుతున్న చక్రకొల్ల ప్రశాంత్, పందింటి ఉదయ్‌కుమార్, దుంపల వినోద్‌ను కమలాపురం మెయిన్ రోడ్డులో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రెండు బంగారు చైన్లు, బుల్లెట్ మోటార్ సైకిల్, కత్తి, నాలుగుసెల్ ఫోన్లు, రూ.10, 200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారు చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బు కోసం తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ దొంగతనం చేసి అందులో తిరుగుతూ ఉన్నారని చెప్పారు. నిందితులపై గతంలో అనేక కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు హాస్టల్లో పెట్టి చదువుకునే పిల్లల కదలికల పట్ల నిఘా ఉంచాలని కోరారు. చెడు వ్యసనాల అలవాటు పడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. మహిళలు బయటకు వచ్చే క్రమంలో ఆభరణాలు ధరించవద్దని విజ్ఞప్తి చేశారు. విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవాలని సూచించారు. కమలాపురం పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను 112 తెలియజేయాలని కోరారు. కేసును ఛేదించిన కమలాపురం సిఐ షేక్. రోషన్, ఎస్సై విద్యాసాగర్, వల్లూరు ఎస్‌ఐ పెద్ద ఓబన్నను ఎస్‌పి అశోక్ కుమార్ అభినందించినట్లు పేర్కొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ఆదర్శనీయం సుందరయ్య జీవితం

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్
ఘనంగా సుందరయ్య 40వ వర్ధంతి

కడప అర్బన్ : సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని, పార్లమెంటులో పదునైన ప్రసంగాలు చేసేవారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ అధ్యక్షతన సుందరయ్య 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య 1913, మే 1వ తేదీ నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గం అలగానిపాడులో ధనిక భూస్వామి కుటుంబంలో జన్మించారని తెలిపారు. 14 సంవత్సరాల వయసలోనే అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక అసమానతలు సరికాదని చెప్పేవారని, కుటుంబ సభ్యులతోనే గొడవ పెట్టుకుని తన ఇంట్లో అందరికీ ఒకే భోజనం చేసేలా తన కుటుంబాన్ని మొదటగా సంస్కరించారన్నారు. 1930లో మద్రాస్‌లో జరుగుతున్న నాటి గాంధీ సభకు హాజరై కాంగ్రెస్ పార్టీలోని సోషలిస్ట్ వింగులో పనిచేశారన్నారు. 'సైమన్ గో బ్యాక్' ఆందోళనలో విద్యార్థి దశలోనే విద్యార్థులకు నాయకత్వం వహించి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేశారన్నారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు అమీర్ హైదర్ ఖాన్ పరిచయంతో పరిపూర్ణమైన కమ్యూనిస్టుగా శిక్షణ పొందారన్నారు. 1936లో దేశంలోని అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఐక్యమై అఖిల భారత కేంద్ర కమిటీ ఏర్పడిందని నాడు అందులో కేంద్ర కమిటీ సభ్యులుగా మొదటగా ఎన్నికయ్యారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీని నిషేధించడంతో 1939 నుంచి 1942 వరకు అజ్ఞాతంలో ఉంటూ రహస్య జీవితాన్ని గడిపారని తెలిపారు. 1943లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ బొంబాయి జాతీయ మహాసభల్లో తిరిగి కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని చెప్పారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ప్రముఖుల్లో అగ్రగన్యుడు సుందరయ్య అని కొనియాడారు. 1952 నుంచి 1955 వరకు స్వాతంత్ర్యం వచ్చాక మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నాయకునిగా పదునైన ప్రసంగాలతో పార్లమెంటులో పాలక పక్షాన్ని ఆలోచింప చేసే వారన్నారు. 1955 నుంచి 1967 వరకు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారన్నారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం ఏర్పడ్డాక తొలి ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా ఉద్యమ నిర్మాణానికి కార్యదీక్షుడై పని చేశారన్నారు. 1978 నుంచి 1983 వరకు మళ్లీ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి యాలేని కృషి చేశారన్నారు. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం', 'ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకం' లాంటి ప్రత్యామ్నాయ ఆలోచనలు, రచనలు చేశారన్నారు. పార్లమెంట్ లోను, అసెంబ్లీలోనూ ప్రజల ముందు పెట్టి ఆలోచింప చేశారన్నారు. 1985, మే 19న అనారోగ్యంతో మరణించేవరకు కూడా కమ్యూనిజమే సరైన రాజకీయ దృక్పదమని, దోపిడీ వర్గాలపై పదునైన వ్యాసాలు రాసి కమ్యూనిస్టు శ్రేణులను చైతన్యపరిచేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు నరసింహ, డివైఎఫ్ఐ కడప నగర కమిటీ కార్యదర్శి విజయ్, సిఐటియు నాయకులు ఉదయ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, మహిళా సంఘం నాయకులు హాజరయ్యారు.

మైదుకూరులో చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజలు

చాపాడు (మైదుకూరు) : మైదుకూరు సుందరయ్య కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ నేటి యువత, రాజకీయ నాయకులు సుందరయ్య జీవితమును ఆదర్శంగా తీసుకోవాలన్నారు దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నేతగా, తెలంగాణ సాయుధ పోరాట రథసారథిగా పుచ్చలపల్లి సుందరయ్య తన జీవితమంతా పేద, బడుగు, బలహీన, కార్మిక వర్గాల కోసం పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గురయ్య, ఇమామ్, హుసేన్, బాబు, లక్ష్మి దేవి, మేరమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : సమాజం కోసం పేదల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య మహోన్నత వ్యక్తి అని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ కొనియాడారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సుందరయ్య తమ ఆస్తులన్నిటిని సమాజంలోని పేదల కోసం ధారపోసిన వ్యక్తి అన్నారు. ఇప్పటికి కూడా నెల్లూరులో సుందరయ్య తమ్ముడు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాలను పేదలకు అందుబాటులో కొనసాగిస్తున్నారన్నారు. సుందరయ్య ఎంపీగా గెలిచినా కూడా పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లే వారిని గుర్తు చేశారు. సుందరయ్య సమ సమాజం రావాలి ,కార్మిక రాజ్యం రావాలి, అప్పుడే పేదలకు ,కార్మికులకు న్యాయం జరుగుతుందని భావించే వారిని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయకుమార్ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ కోశాధికారి రాఘవ ప్రమీలమ్మ రాములమ్మ సుబ్బలక్ష్మి చేనేత రంగ జిల్లా కార్యదర్శి గూగుల్ ఎస్ చెన్నారెడ్డి, పెద్ద సంఖ్యలో పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రొద్దుటూరు : నివాళులర్పిస్తున్న నాయకులు

అట్లూరు : అట్లూరు మండల క్రాస్‌రోడ్ సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడులకు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఇ.రమణయ్య మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు సహాయక చర్యల్లో పాల్గొన్నారని, అంటూ రోగాలు ప్రబలి చాలామంది చనిపోతుంటే తన తమ్ముడు రామచంద్రారెడ్డిని డాక్టర్ చేసి నెల్లూరు జిల్లాలో ప్రజా వైద్యశాల నిర్మించారని చెప్పారు. ప్రజలకు ఉచితంగా వైద్యం అందించారని పేర్కొన్నారు. తెలంగాణలో రజాకార్లకు వ్యతిరేకంగా భూ పోరాటం చేసి నాలుగు లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సుందరయ్యకే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ. దుర్గమ్మ బి. స్వప్న బీ.లతా, పి .రవిచంద్ర గోపయ్య నాగరాజు పాల్గొన్నారు.

కాశినాయన : మండల పరిధిలోని సావిశెట్టిపల్లె గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతి నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్వేష్ మండల కార్యదర్శి పోలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణ భారతదేశం కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు పార్లమెంటు ఉత్తమ ప్రతిపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య దళితులు అట్టడుగు వర్గాల కోసం వ్యవసాయ కూలి రేట్ల కోసం కుల వివక్ష నిర్మూలన కోసం పోరాడారన్నారు రైతులకు గిట్టుబాటు ధర కోసం ప్రాజెక్టుల కోసం విశాలాంధ్రలో ప్రజారాజ్యం నిర్మించాలని రాష్ట్రవ్యాప్తంగా శ్రామిక కార్మిక వర్గాన్ని నాయకత్వం వహించి ఉద్యమాలు చేపట్టారన్నారు కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు నరసింహులు కిరణ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురు బాబు సాగర్ ఉదయ్ దేవకుమార్, వర కుమార్, సునీల్, ప్రశాంత్ పాల్గొన్నారు

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బద్వేలు

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ కమినర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మడకలవారిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల ప్రకారం కమిషనర్ సోమవారం సమాచార హక్కు చట్టం-2005 గురించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సులో జిల్లా సమాచార హక్కు చట్టం-2005 రక్షణవేదిక జిల్లా ఉపాధ్యక్షులు బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, జవాబుదారితనం, అవినీతి రహిత పాలనను ప్రజలకు అందించడానికి భారత పార్లమెంట్‌లో జూన్ 15, 2005లో ఈ చట్టాన్ని ఆమోదించారన్నారు. అక్టోబర్ 12,2005 నుంచి అమలైందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రజలు వారికి అవసరమైన సమాచారాన్ని చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం ఒక్క అర్జీ ద్వార ఇంటి వద్దనుండే 30 రోజుల లోపల అడిగిన సమాచారం పొందవచ్చన్నారు. ఆర్‌టిఐ చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని, సమాచారం కోస ప్రభుత్వ కార్యాలయాలలోని అధికారుల చుట్టూ తిరగనవసరం లేదని పేర్కొన్నారు. రక్షణ వేదిక ప్రచురణ చేయించిన కరపత్రాలను హాజరైన ప్రజలకు సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గురుమూర్తి

నేడు మహిళలకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-లింగాల

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగు మహిళలకు ఉద్యోగా అవకాశాలను కల్పిస్తున్నట్లు డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎం రామాంజనేయులు తెలిపారు స్థానిక మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాటా్లడారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్‌లో పులివెందులలో మహిళలకు ట్రైని ట్రైలర్‌గా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత స్రాల నుంచి 38 సంవత్సరాల వారు అర్హులు అన్నారు. వెలుగు కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు మరిన్ని వివరాలకు 77803768 16,7416789336 నెంబరులకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహానాడు విజయవంతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -చాపాడు (మైదుకూరు)

కడపలో ఈనెల 27న జరగబోయే టిడిపి పార్టీ మహానాడును విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మైదుకూరు పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కడపలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించుకునే అవకాశాన్ని పార్టీ అదిష్టానం కల్పించిందన్నారు. మైదుకూరు ప్రాంతం నుండి 20 నుంచి 30 వేల మంది టిడిపి కార్యకర్తలు మహానాడుకు హాజరు కావాలన్నారు. మైదుకూరు నుంచి అధికంగా కార్యకర్తలు తరలివస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మన ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. కార్యకర్తల అభివృద్ధే ధ్యేయంగా టిడిపి పార్టీ పనిచేస్తుందని తెలిపారు. అభివృద్ధి చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- లింగాల : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ భూ, రేషన్, ఇతర సమస్యలపై ప్రజల నుంచి వినతులు వచ్చాయని చెప్పారు. వాటిని స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఎంఇఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం ఎంఇఎఫ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె. రవీంద్ర, గౌరవ అధ్యక్షులుగా రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా గంగన్న, శ్రీనివాసులు, జి ప్రసాద్ హరిప్రసాదు, ఉపాధ్యక్షులుగా కత్తి శ్రీనివాసులు రామాంజనేయులు, అడవి రాముడు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి, సహాయ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, వీరుడు, కోశాధికారిగా రాం ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శిగా రవీంద్ర రవిశంకర్, కార్య నిర్వాహ సభ్యులుగా రామాం జనేయులు, బాల వీర నారప్ప, గంగ రాజు, గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

JAMMALAMADUGU MUNICIPALITY

'e' Procurement Tender Notice
No. 14 to 158/2025-26/E1, Dt:19.05.2025.

General Fund	- 112 Works	- Rs. 887.71 Lakhs
DMF Grant	- 14 Works	- Rs.131.70 Lakhs
DTCP Grant	- 18 Works	- Rs. 250.00 Lakhs

Bid Document Downloading Start Time	: 21.05.2025@10.00A.M.
Bid Document Downloading End Date	: 05.06.2025@3.00 P.M.
Last date/Time of receipt of Tender	: 05.06.2025@3.30 P.M.
Price Bid Opening Dated	: 05.06.2025@4.00 P.M.

All rights are reserved to the Commissioner to cancel or Reject the tenders without assigning any reasons there of

Further details any corrigendum can be seen @ https://www.tender.apeprocurement.gov.in.

Commissioner
Jammalamadugu Municipality.

నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడి

నీలం సంజీవరెడ్డికి భారతరత్న ఇవ్వాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ భారత రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డికి భారతరత్న ప్రదానం చేయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. సోమవారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి 112వ జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం సంజీవ రెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, నీతికి, నిర్భీతికి నిలువుటద్దం అన్నారు. సంజీవరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్ని నాలుగేళ్లు జైలు జీవితం గడిపినట్లు చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ, రాష్ట్ర మంత్రి, ఉప ముఖ్యమంత్రి, సిఎం, కేంద్ర మంత్రి, లోక్‌సభ స్పీకర్, రాష్ట్రపతిగా అనేక పదవులు అలంకరించి గొప్ప పరిపాలనా దక్షుడుగా అనిపించుకున్నారని చెప్పారు.పిసిసి అధ్యక్షునిగా, ఎఐసిసి అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమా రాజా, మదార్, సాయి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

చిన్నారుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారిమఠం మండలం మల్లెపల్లెకు చెందిన చిన్నారులు గత వారంలో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం ఒకొక్క కుటుంబానికి రూ. 1 లక్ష చొప్పున చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో మండల తెదేపాధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మిల్లు శ్రీను, కానాల మల్లికార్జునరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, సాంబశివారెడ్డి, పూజ శివ, చిలమల నారాయణతో సహా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంటాడుతున్న విద్యుత్ సమస్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ కొత్త పత్తూరులో విద్యుత్ సమస్యలు ఆ ప్రాంత ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. స్తంభాలకు విద్యుత్ సరఫరా అవుతుందని చాలాకాలం నుంచి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడ లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్న, నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్తు స్తంభానికి కరెంటు ప్రసారం కావడంతో మూగజీవి ప్రాణాలు కోల్పోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నాయి.

విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మూగజీవి

వీధినాటకం వేస్తున్న కళాబృందం సభ్యులు

ఎయిడ్స్‌పై వీధినాటకం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ,జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జయశంకర్ కళాకారుల బృందం పట్టణంలోని వైఎంఆర్ కాలనీ సర్కిల్‌లో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై వీధినాటకం నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్, టిబి గురించి తెలుపుతూ హెచ్‌ఐవి కేవలం నాలుగు రకాలుగా వస్తుందని తెలిపారు. సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా, కలుషిత సూదులు, సిరంజిల ద్వారా, కలుషిత రక్త మార్పిడి ద్వారా, హెచ్‌ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు వస్తుందని చెప్పారు. హెచ్‌ఐవి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిఇఆర్‌డి ఎస్ ప్రాజెక్టు మేనేజర్ పి.నరేష్ కుమార్, పుల్లయ్య, ఐసిటిసి కౌన్సిలర్ బాల గంగిరెడ్డి సిఆర్‌డిఎస్ సిబ్బంది ఓలమ్మ, భాగ్యలక్ష్మి, సునీత, ఉమామహేశ్వరి, పీర్ ఎడ్యుకేటర్స్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లైంట్ అయిన శ్రీ తిప్పిరిపాటి దేవదత్త, తండ్రి: తిప్పిరిపాటి శిఖామణి, డోర్ నెం.43/2-2-1, ప్రకాశ్ నగర్, చిన్నచౌకు, కడప సిటీ వారి సూచనల మేరకు తెలియజేయడం ఏమనగా, నా క్లైంట్ కడప సిటీలోని ఇంటి పాత డోర్ నెంబరు 8/2-2-1, కొత్త డోర్ నెం. 43/2-2-1 ఇంటిని దస్తావేజు తేది: 29.11.2014 డాక్యుమెంట్ నెం.5209/2014, కోటపాటి షకీనా, భర్త: శ్రీధర్ గారి దగ్గరినుండి కొనుగోలు చేసియున్నారు. ఆ సమయములో పైన కనబరిచిన ఒరిజనల్ డాక్యుమెంట్ నా క్లైంట్‌కు స్వాధీనం చేయలేదు మరియు అమ్మినవారు ఏ బ్యాంకులో గానీ, ఫైనాన్స్ సంస్థలలోగానీ తాకట్టు పెట్టలేదు అని తెలియజేసియున్నారు. డూప్లికేటు కాపీ నాక్లైంట్కు ఇచ్చినారు. నా క్లైంటు కూడా ఒరిజినల్ డాక్యుమెంట్ను అతడు గానీ, అతని సంబంధీకులుగానీ ఏబ్యాంకులో గానీ, ఫైనాన్స్ సంస్థలలో గానీ తాకట్టు పెట్టలేదు అని తెలియజేసి వున్నారు. ఒకవేళ నా క్లైంటుగానీ, అతనికి సంబంధించిన వారుగానీ బ్యాంకుల లోనైనా, ఫైనాన్స్ సంస్థలలో గానీ తాకట్టు పెట్టినట్లు భవిష్యత్తులో తెలియజేసిన యెడల నాకెంటుపై చట్టరీత్యా చర్యలు అనగా సివిల్ గానీ, క్రిమినల్ గానీ తీసుకోగలరని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

సి. సుందర రాజు, B.A B.L.,
అడ్వకేటు మరియు నోటరి, కడప.
సెల్: 9989920601.